సాక్షి శ్రీకాకుళం

శనివారం । 25 । మార్చి । 2023



ఆసరాకు సర్వం సిద్ధం

వైఎస్సార్ ఆసరాకు సర్వం సిద్ధమైంది. అధికారులు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు.

- 8లో



పట్టపగలే దోచేశారు..!

భావరాజుపాలెంలో పట్ట పగలే దొంగలు పడ్డారు. పది తులాల బంగారం దోచేశారు.

- 8లో

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

అరసవల్లి: జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు శనివారం ఉదయం 10 గంటల నుంచి జెడ్పీ సమావేశ మందిరంలో జరుగుతాయని జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్ తెలియజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మొత్తం 7 స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని, ఈ సమావేశాలకు ఆయా కమిటీ సభ్యులంతా హాజరుకావాలని ఆయన కోరారు.



● ఇఫ్తార్ విందు



శ్రీకాకుళంలోని జీటీ రోడ్డులో ఉన్న జామియా మసీదులో రంజాన్ మాసం సందర్భంగా మొదటి రోజు ఇఫ్తార్ విందు శుక్రవారం సాయంత్రం జరిగింది. ముస్లింలంతా పాల్గొని ముందుగా ప్రార్థనలు చేశారు. మసీదుల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. – శ్రీకాకుళం కల్చరల్

● అలంకార ప్రియుడు

జిల్లా కేంద్రంలోని మొండేటివీధిలో లక్ష్మీ గణపతికి ఉదయం పాలాభిషేకం జరిగింది. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. – శ్రీకాకుళం కల్చరల్



● కాబోయే అమ్మకు.. కమ్మనైన కానుక



కొత్తూరు మండలం మాతల సచివాలయంలో శుక్రవారం ఓ కొత్త దృశ్యం కనిపించింది. తోటి ఉద్యోగులే కుటుంబ సభ్యులుగా వ్యవహరించి ఓ వీఆర్‌ఓకు సీమంతం చేశారు. ఈ సచివాలయంలో వీఆర్‌ఓగా పనిచేస్తున్న మాధురికి తహసీల్దార్ పి.బాలతో పాటు మండలంలోని వీఆర్వోలు, సర్వేయర్లు కొత్త చీర, గాజులు, పసుపుకుంకుమలు పెట్టి సంప్రదాయబద్ధంగా సీమంతం చేశారు. పండంటి బిడ్డకు జన్మనివ్వాలని మనసారా దీవించారు. –కొత్తూరు

న్యూస్‌రీల్

'వాహన చట్టాలు అమలు చేయాల్సిందే'



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: పోలీస్, బీమా కంపెనీల అధికారులు మోటార్ వెహికల్ చట్టం అమెండ్‌మెంట్–2022ను పరిధిలోకి తీసుకుని చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఆయన శుక్రవారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యాలయంలో ఈ అమెండ్‌మెంట్‌పై పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్స్‌కు, పలు బీమా కంపెనీల అధికారులకు, న్యాయవాదులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ కొత్త చట్టాలను అనుసరించి ఎవరి బాధ్యత వాళ్లు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. వాహన ప్రమాదాల్లో కక్షిదారులకు సత్వరం న్యాయం అందించాలన్నారు.

శ్రీముఖలింగం ఆలయ హుండీ ఆదాయం రూ.4.37 లక్షలు



ఆలయ ఆదాయం లెక్కిస్తోన్న ఈఓ అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం శివరాత్రి అనంతరం హుండీ ఆదాయం రూ.4,37,519 వచ్చినట్లు ఆలయ ఈఓ పి.ప్రభాకరరావు శుక్రవారం తెలిపారు. ఆలయ అర్చకులు, కొమనాపల్లి సత్యసాయి సేవా సంఘం సభ్యుల సమక్షంలో ఆదాయం లెక్కించినట్లు ఈఓ తెలిపారు.

నీలమణి దుర్గ హుండీ ఆదాయం రూ.10.11 లక్షలు

పాతపట్నం: పాతపట్నంలో కొలువైన నీలమణిదుర్గ అమ్మవారి హుండీ ఆదాయం రూ.10,11,709 వచ్చిందని ఆలయ ఈఓ టి.వాసుదేవరావు చెప్పారు. శ్రీకాకుళం దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ జీవీబీఎస్ రవికుమార్ పర్యవేక్షణలో శుక్రవారం హుండీ కానుకల లెక్కింపు జరిగిందన్నారు. 84 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. అలాగే మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న శ్రీ వేంకటేశ్వర ఆలయంలో 360 రోజులకు భక్తుల కానుకల ద్వారా రూ.1,11,856లు హుండీ ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు.

'అనుబంధ కాలేజీలకు నాక్ గుర్తింపు తప్పనిసరి'



సమావేశంలో మాట్లాడుతున్న ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ రామ్మోహన్‌రావు

ఎచ్చెర్ల క్యాంపస్: విశ్వవిద్యాలయాల అనుబంధ కళాశాలలకు నాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్) గుర్తింపు తప్పనిసరని రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహన్ రావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని అనుబంధ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు, అనుబంధ కళాశాలలకు నాక్ గుర్తింపు అంశంపై శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏడాది లోపు రాష్ట్రంలో అన్ని కళాశాలలు నాక్ గుర్తింపు సాధించాలని సూచించిందని అన్నారు. నాక్ గుర్తింపు లేకుంటే కళాశాలకు భవిష్యత్ ఉండదని స్పష్టం చేశారు. నాక్ సైతం గుర్తింపు మంజూరుకు రూ. 3.50 లక్షలు దరఖాస్తుకు వసూలు చేస్తుందని, అన్ని ప్రమాణాలు ఉంటేనే గుర్తింపు ఇస్తుందని అన్నారు. ఏ, బీ ప్లస్ వంటి గ్రేడులు సాధించాలంటే తప్పకుండా మౌలిక, బోధన వసతులు ఉండాలన్నారు. భవిష్యత్‌లో విద్యలో సైతం ఇంటర్న్‌షిప్ తప్పనిసరిగా ఉంటుందని చెప్పారు.

సైబర్ సవాల్



- పెరిగిపోతున్న సైబర్ మోసాలు
- యువతే టార్గెట్
- ఎస్పీ చొరవతో కేసులు పరిష్కరిస్తున్న సైబర్ విభాగం
- 1930కు ఫిర్యాదు చేయాలంటున్న పోలీసులు

శ్రీకాకుళంక్రైమ్: పెళ్లి పేరుతో డబ్బులు పోగొట్టుకున్నది ఒకరు. జాబ్ వస్తుందనే ఆశతో సొమ్ములు ఇచ్చేసింది మరొకరు. లాటరీ ఆనందంలో ఖాతా ఖాళీ చేసుకుంది ఇంకొకరు.. నేరమేదైనా వేదిక మాత్రం ఆన్‌లైనే. సాంకేతికత పెరుగుతూ పనులు సులభమవుతున్న కాలంలో.. అదే సాంకేతికతను అడ్డం పెట్టుకుని కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. ఈ సైబర్ నేరాలు పోలీసులకు కూడా సవాల్ విసురుతున్నాయి. ఎప్పటికప్పుడు కేసులు పరిష్కరిస్తున్నా.. ఇంకా కొత్త కేసులు నమోదవుతూనే ఉన్నాయి. జనం ఈ సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుంటేనే మోసాలు తగ్గుతాయని పోలీసులు సూచిస్తున్నారు. 2020 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 154 కేసులు నమోదయ్యాయి. ఆన్‌లైన్ లోన్‌యాప్స్, ఏఈపీఎస్ (ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సర్వీస్), కస్టమర్ కేర్ ఫ్రాడ్ కేసులకు సంబంధించి రోజుకో ఫిర్యాదు అందుతోందని సైబర్ పోలీసులు చెబుతున్నారు.

ఉద్యోగం పేరుతో..



వర్క్ ఫ్రం హోమ్ ఆన్‌లైన్ జాబ్ ఇస్తామంటూ యాడ్ లేదా క్లాసిఫైడ్ ఆన్‌లైన్‌లో వస్తుంది. ముందుగా రిజిస్ట్రేషన్ ఫీజు యూపీఐ ట్రాంజెక్షన్ ద్వారా కట్టమంటారు. లేదంటే వారే ఓ లింక్ పంపించి క్లిక్ చేసి డబ్బులు వేయమంటారు. అక్కడితో ఆగరు. ల్యాప్‌టాప్, సర్టిఫికెట్ వెరిఫికేషన్, అపాయిట్‌మెంట్ లెటర్ ఖర్చులంటూ దఫదఫాలుగా గుంజేస్తారు. **ఇలాంటి ప్రకటనలు చూసినప్పుడు నిజనిర్ధారణ చేసుకోవాలి. అప్పటికప్పుడే ఎవరూ డబ్బులు వేయమని అడగరు. ఇది గుర్తుంచుకోవాలి.**



లాటరీల మాయ..

మీకు లాటరీ రూ. 2 లక్షలు తగిలిందని మీ మొబైల్‌కు కాల్ లేదా మెసేజ్ వస్తుంది. మీరు రిజిస్ట్రేషన్, ప్రాసెస్ ఫీజు కడితే చాలంటారు. కొరియర్‌లో విలువైన గిఫ్ట్ పంపాం, మధ్యలో ఆగింది, మీరు అమౌంట్ పంపితే వస్తుందంటారు. ఇలాంటి కేసులు నిత్యం వస్తుంటాయి. ఆన్‌లైన్‌లో మీకు రూ. 30 వేల లోన్ వస్తుందంటారు. లింక్ క్లిక్ చేయమంటారు. **ఇలాంటివి నమ్మకూడదు. డాక్యుమెంట్ వెరిఫికేషన్ లేకుండా వ్యక్తిగత లోన్‌లు ఎవరూ ఇవ్వరు. విలువైన గిఫ్ట్‌లూ పంపరు. అది ప్రజలు గమనించాలి.**

ఓటీపీలు పంపించి..



మీకు ఓటీపీ వచ్చింది. చెప్తే మీకు అమౌంట్ వేస్తాం.. లేదంటే మీకొచ్చిన గిఫ్ట్ యాక్టివేట్ అవుతుంది అంటూ ఆశ పెడతారు. యాక్టివేట్ అవ్వాలంటే మీ ఓటీపీ ఓ సారి చెప్పండంటూ ఫోన్‌లు చేస్తారు.

కస్టమర్ కేర్ నుంచి..

ఇప్పుడు మొబైల్ నిండా ఆన్‌లైన్ షాపింగ్ యాప్‌లే. మోసగాళ్లు వాటిని కూడా వాడుకుంటున్నారు. ఫలానా యాప్ నుంచి మాట్లాడుతున్నామంటూ మోసం చేస్తారు. అలాగే వీటికి సంబంధించి నకిలీ కస్టమర్ కేర్ నంబర్లూ ఉంటాయి. గూగుల్‌లో వెతికి వాటికి కాల్ చేస్తే ఖాతాకు మంగళం పాడేస్తారు.

ఓటీపీ ఎవరికీ చెప్పకూడదని బ్యాంకులన్నీ ఎప్పటి నుంచో జాగ్రత్తలు చెబుతున్నాయి. ఆ జాగ్రత్త పాటిస్తే మేలు.

పెళ్లి సంబంధాల మోజులో..



మ్యాట్రిమోనీ సైట్‌ల పేరుతో మోసాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పెళ్లి కాని వ్యక్తుల వివరాలు తీసుకుని అమ్మాయి పేరుతో దగ్గరవుతారు. ఏవో అవసరాలు చెప్పి డబ్బులు గుంజేస్తారు. అదును చూసి మాయమైపోతారు. వ్యక్తి ఎవరో తెలియకుండా డబ్బులు వేస్తే మోసపోవడం ఖాయం.

ఇంకా కొన్ని..

- యూపీఐ నగదు బదిలీల పేరుతో కొందరు మన ఎం–పిన్, పాస్‌వర్డ్, క్యూఆర్ కోడ్ డీటైల్స్ తీసుకోవడానికి ప్రయత్నిస్తారు. ఆ వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ ఇవ్వకూడదు.

అప్రమత్తంగా ఉండాలి..

ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు, యువత అప్రమత్తంగా ఉండాలని, మనీ ఆన్‌లైన్‌లో పోగొట్టుకుంటే తక్షణం 1930కు డయల్ చేయాలని పోలీసులు సూచిస్తున్నారు. లోన్ యాప్‌ల జోలికి పోకూడదని హెచ్చరిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమైన వారిని నమ్మడం మానుకోవాలని చెబుతున్నారు.

- అలాగే బయోమెట్రిక్ వేలిముద్రలు వేసినప్పుడు కూడా జాగ్రత్తగా ఉండాలి. ఈ డేటా లీక్ కాకుండా చూసుకోవాలి.
- ఏటీఎం సెంటర్లలో పిన్ ఎంటర్ చేసేటప్పుడు , లావాదేవీ ఆగిపోయినప్పుడు కార్డ్ తీసుకునేటప్పుడు నిశితంగా గమనించాలి. లేదంటే మన కార్డు క్లోనింగ్ చేసి మోసం చేసే అవకాశం ఉంటుంది.
- అన్నింటి కంటే పెద్ద మోసం ఆన్‌లైన్ లోన్స్. ఖాళీగా ఉన్న యువత, నిరుద్యోగులు, డబ్బులు అవసరమైన వారికి ఎర వేసి వారికి అప్పులు ఇచ్చి ఆస్తులు లాగేస్తున్నారు. ఈ ఆన్‌లైన్ లోన్స్‌కు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. మన గ్యాలరీకి అనుమతి తీసుకుని మన ఫొటోలు లాగేసి న్యూడ్‌గా మార్ఫ్ చేసి నిలువునా దోచేస్తారు.

జాతీయ సెపక్ తక్ర శిక్షణ శిబిరాలకు ప్రేమశ్రీ, కల్యాణి

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి సెపక్ తక్ర శిక్షణ శిబిరాలకు శ్రీకాకుళం జిల్లా నుంచి మహిళల విభాగంలో ఎస్.ప్రేమశ్రీ, పి.కల్యాణి ఎంపికయ్యారు. ఇటీవల నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి సెపక్‌తక్ర చాంపియన్‌షిప్ పోటీల్లో ఉత్తమ ఆటతీరును కనబర్చిన క్రీడాకారులను నేషనల్ మీట్‌లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాబబుల్స్ జట్టుకు ఎంపికచేశారు. వీరికి ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు ప్రకాశం జిల్లా ఒంగోలులో కోచింగ్ క్యాంపు నిర్వహిస్తున్నారు. ఈ కోచింగ్ క్యాంప్‌లో రాణించిన ప్లేయర్స్ ఏప్రిల్ 1 నుంచి 5వ తేదీ వరకు మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరిగే జాతీయస్థాయి సెపక్‌తక్ర చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళల జట్టుకు ఎంపికవుతారని జిల్లా సెపక్‌తక్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి తెలిపారు. ఎంపికైనవారిలో శ్రీకాకుళం నగరానికి చెందిన ప్రేమశ్రీ ఇంటర్ సెకండియర్ చదువుతుండగా శ్రీకాకుళం రూరల్ పాత్రునివలసకు చెందిన పి.కళ్యాణి డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. వీరిద్దరూ ఒంగోలు కోచింగ్ క్యాంప్‌లో చేరేందుకు శుక్రవారం ఇక్కడ నుంచి పయనమై వెళ్లారు. వీరిద్దరిని శ్రీకాకుళం సెపక్‌తక్ర అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి వీడ్కోలు పలికి అభినందించారు. పోటీలకు వెళ్లేందుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని అందించారు.



ప్రేమశ్రీ, కల్యాణిలను అభినందిస్తున్న ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, పక్కనే అర్జున్‌రెడ్డి

క్షయ నివారణకు ఉచిత మందుల పంపిణీ



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

అరసవల్లి: క్షయ వ్యాధిని కేవలం ఆరు నెలల్లోనే మందుల వినియోగంతోనే నయం చేయవచ్చునని, ఇందుకోసం ప్రతి రోగికి ప్రభుత్వమే ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో టీబీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిపై ప్రజలంతా అవగాహన పెంచుకోవాలని, అనుమానితులు వెంటనే ప్రభుత్వాస్పత్రుల్లో పరీక్షలు చేయించుకుని, వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే ఆరు నెలల పాటు ఉచితంగా మందులు పొందాలన్నారు. ఈ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ చేయి చేయి కలపాలని, కలసికట్టుగా వ్యాధిని పారద్రోలాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి, టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ ఎస్.అనూరాధలు మాట్లాడుతూ జిల్లాలో క్షయ వ్యాధి నివారణకు ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఇదే సందర్భంగా జిల్లాకు క్షయ నివారణ చర్యల్లో తీసుకుంటున్న చర్యలకు గాను జిల్లాకు బ్రాంజ్ మెడల్ వచ్చినట్లుగా ప్రకటించారు. వరుసగా మూడో ఏడాది కూడా బ్రాంజ్ మెడల్ జిల్లాకు లభించడం విశేషమని ప్రకటించారు. కార్యక్రమంలో భాగంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్షయ వ్యాధి నివారణ బాధ్యతగా ప్రతిజ్ఞ చేశారు. సుమారు 600 రోగులకు ప్రత్యేక పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, డాక్టర్ కృష్ణమోహన్, మంత్రి వెంకటస్వామి పాల్గొన్నారు.

'మూఢ నమ్మకాలు వీడండి'



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

టెక్కలి రూరల్: మండలంలోని పెద్దరోకళ్లపల్లి గ్రామంలో ఒక వ్యక్తిని చిల్లంగి పేరుతో స్థానికులు వేధిస్తున్నారని కొన్నాళ్ల కిందట టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డికి ఫిర్యాదు అందింది. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ తన సిబ్బందిని శుక్రవారం గ్రామానికి పంపించి స్థానికులతో మాట్లాడించారు. చిల్లంగి వంటి మూఢ నమ్మకాలను నమ్మవద్దని, ఈ నెపంతో ఒక వ్యక్తిని వేరు చేసి అవమానించడం తగదని అర్థమయ్యేలా చెప్పారు. అనంతరం గ్రామస్తులందరినీ ఒక చోటకు తీసుకువచ్చి కలిసి మెలిసి ఉంటామని మాట తీసుకున్నారు. స్థానికులంతా ఒప్పుకోవడంతో ఆ వ్యక్తి తన ఫిర్యాదును వెనక్కి తీసుకుంటానని చెప్పారు.

తల్లి చెంతకు బాలుడు

శ్రీకాకుళం క్రైమ్: రెండేళ్ల కిందట తల్లి నుంచి దూరమైన బిడ్డ మళ్లీ తల్లి పొత్తిళ్లకు చేరాడు. పోలీసుల కృషి, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం సిబ్బంది చొరవ ఈ తల్లీబిడ్డలను కలిపింది. రెండేళ్ల కిందట బిడ్డను పోషించలేని స్థితిలో తల్లి వెళ్లిపోతే.. ఆ పసివాడిని ఆశ వర్కర్లు శ్రీకాకుళంలోని శిశుగృహలో చేర్పించారు. ఆ బాలుడిని శిశుగృహ సిబ్బంది కంటికి రెప్పలా కాచుకున్నారు. అయితే అనాథ బాలలను అయిన వారికి చేర్చే కార్యక్రమం చేపడుతున్న మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం సిబ్బంది ఈ బాలుడిని తల్లి చెంతకు చేర్చాలని తలచారు. ఇందుకోసం పోలీసుల సాయం తీసుకున్నారు. ఆ బాలుడి తల్లి మచిలీపట్నంలోని చిలకపూడి గ్రామంలో ఉన్నట్లు గుర్తించి.. జిల్లా బాలల సంక్షేమ సమితి సూచనల మేరకు బిడ్డను తల్లికి అప్పగించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం శ్రీకాకుళం మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం పోలీసుల సమక్షంలో ఎస్పీ జీఆర్ రాధిక బిడ్డను తల్లి చెంతకు చేర్చారు. ఎస్పీ మాట్లాడుతూ బాలుడికి ఉన్నత విద్య అందించాలని, మంచి ప్రయోజకుడిని చేయాలని సూచించారు. బాలుడిని తల్లి వద్దకు చేర్చడంలో కృషి చేసిన ఏహెచ్‌టీయూ విభాగం పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ టీపీ విఠలేశ్వరరావు, ఏహెచ్‌టీయూ ఎస్ఐ కేశవరావు, సిబ్బంది పాల్గొన్నారు.



బాలుడిని తల్లి చెంతకు చేర్చిన ఎస్పీ రాధిక

● స్నాతకోత్సాహం



వైద్యులు ప్రజాసేవ చేసేందుకు ఎంతో అవకాశం ఉంటుందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. రిమ్స్ వైద్య కళాశాలలో 2017 బ్యాచ్ వైద్య విద్యార్థులకు పట్టా ప్రదానోత్సవం (స్నాతకోత్సవం) కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ తీసుకున్న విద్యార్థులు పీజీలు కూడా పూర్తి చేసి ఆరోగ్య సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. ఉత్సాహవంతమైన వాతావరణంలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని చూస్తుంటే తాను చదువుకున్న రోజుల్లో స్నాతకోత్సవానికి హాజరు కాలేక పోవడం బాధ కలిగిస్తోందన్నారు.ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలం మాట్లాడుతూ వైద్య వృత్తి పవిత్రమైనదని, ఆరోగ్యం బాగుంటేనే ప్రజలు దేనినైనా సాధించగలుగుతారని అన్నారు. ఈ సందర్భంగా 2017కు చెందిన 99మంది విద్యార్థులకు డిగ్రీ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ మురళీ కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కోటేశ్వరరరావు తదితరులు పాల్గొన్నారు. – శ్రీకాకుళం

గొట్టా బ్యారేజీ పటిష్టతకు చర్యలు

హిరమండలం: వంశధార గొట్టా బ్యారేజీ పటిష్టతకు చర్యలు తీసుకుంటున్నట్లు వంశధార ఎస్ఈ డోల తిరుమలరావు అన్నారు. గతంలో వచ్చిన వరదలకు బ్యారేజీ దిగువ భాగాన కోతకు గురైన గట్టు ప్రాంతంలో సుమారు రూ.27 లక్షలతో నిర్మించనున్న గోడ రాతికట్టుకు సంబంధించిన అలైన్‌మెంట్ పనులు, వంశధార రిజర్వాయర్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు.గొట్టా బ్యారేజీ నిర్మాణం చేపట్టి సుమారు 50 ఏళ్లు పూర్తయిందన్నారు. ఐదారేళ్లుగా మెయింటెనెన్స్ తగ్గిందని, గతంలో నిధులు మంజూరైనా కాంట్రాక్టర్ వెళ్లిపోవడంతో పనులు ఆగిపోయాయని తెలిపారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే రెడ్డిశాంతి, మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రభుత్వానికి విన్నవించడంతో నిధులు మంజూరయ్యాయని, పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. బ్యారేజీని పూర్తి స్థాయిలో ఆధునీకీకరణ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డ్రిప్ కింద రూ.25 కోట్లు నిధులు మంజూరుకు ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు.



వంశధారలో కోతకు గురైన గోడ నిర్మాణ అలైన్‌మెంట్ పనులు పరిశీలిస్తున్న వంశధార ఎస్ఈ తిరుమలరావు

ఆగస్టు నాటికి ఎత్తిపోతల పథకం పూర్తి

గొట్టా బ్యారేజీ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు మూడు ఎకరాలు భూ సేకరణ చేయాల్సి ఉందన్నారు. ఈ పథకం పనులకు మెదట విడతగా రూ.140కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఈ పనులు ఆగస్టు నెలాఖరుకు పూర్తి చేసే లక్ష్యంతో ఉన్నామన్నారు. లిఫ్ట్ పనులు పూర్తయితే 10 నుంచి 12 టీఎంసీల నీటిని రిజర్వాయర్‌కు మళ్లించి రెండు పంటలకు సాగునీరు అందించేందుకు వీలు కలుగుతుందన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్‌లో వచ్చే వరదలకు ఇక్కడి నుంచి నీటిని తోడే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు డీఎస్ఈ ఎంవీ రమణ, ఈఈ ప్రదీప్ కుమార్, డీఈలు అనిల్ కుమార్, సతీష్, ఏఈలు సత్యనారాయణ, పరిషిద్ బాబు, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీతమ్మకు బంగారు ఆభరణాల వితరణ



బంగారు తాళిబొట్టు చూపుతున్న అర్చకులు

కవిటి: మండలంలోని రాజపురంలో సీతారామాలయంలో ఉగాది సందర్భంగా ఐదురోజుల పాటు నిర్వహించిన వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలంతా కలిసి సీతమ్మవారికి రూ.1.40 లక్షల విలువైన రెండుతులాల బంగారు ఆభరణాలు చేయించి బహూకరించారు. ముగింపు వేడుకల్లో భాగంగా పెద్దసంఖ్యలో మహిళలు సామూహిక కుంకుమార్చనల్లో పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పెంపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ పాఠశాల, కళాశాలల్లో 2023–24 విద్యాసంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్మీడియట్ ఫస్టియర్ (ఇంగ్లీష్ మీడియం)లో ప్రవేశాలకు దరఖాస్తుల గడువు ఈ నెల 31 వరకు పొడిగించినట్టు సంస్థ జిల్లా కోఆర్డినేటర్ జి.గ్రేస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 23న ప్రవేశ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9701736862, 7569788629 నంబర్లను సంప్రదించాలని కోరారు.

'రేపు రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయి'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఆదివారం పనిచేస్తాయి. ఈ మేరకు రిజిస్ట్రేషన్లు, స్టాంప్స్ శాఖ కమిషనర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం సెలవుదినం అయినప్పటికీ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ కార్యకలాపాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. వీటితో పాటు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచితో పాటు రాజాం ఎస్‌బీఐ శాఖ ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

విలువైన సమయాన్ని వృథా చేయొద్దు



మాట్లాడుతున్న డాక్టర్ గుండ గంగాధర్

శ్రీకాకుళం రూరల్: విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గ్యాస్ట్రో ఎంట్రాలజీ సర్జికల్ వైద్యులు డాక్టర్ గుండ గంగాధర్ అన్నారు. శుక్రవారం సింగుపురంలోని క్రాంతి విద్యానికేతన్‌లో పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ గుండ అమ్మడు, అమర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆదిమూర్తి పాల్గొన్నారు.

పలాస రైల్వేస్టేషన్‌లో వృద్ధుడి మృతి




రైలు పట్టాలపై వెంకటస్వామి మృతదేహం

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్–2లో వృద్ధుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. జీఆర్‌పీ పోలీసులు విచారణ జరపగా సోంపేట మండలం పాత్రకండ గ్రామానికి చెందిన గోకర్ల వెంకటస్వామి(70)గా గుర్తించారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. జీఆర్‌పీ ఎస్‌ఐ షరీఫ్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు.

వైఎస్సార్ ఆసరాకు సర్వం సిద్ధం

- నేడు మహిళా సంఘాల సభ్యుల వ్యక్తిగత ఖాతాల్లో రుణమాఫీ సొమ్ము జమ
- 42,326 సంఘాల్లో 4,53,708, మంది సభ్యులకు లబ్ధి



శ్రీకాకుళం పాతబస్టాండ్: మహిళా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. 2019 ఎన్నికల ముందు మహిళా స్వయంశక్తి సంఘాలకు ఉన్న బ్యాంకు రుణాలను నాలుగు విడతల్లో చెల్లిస్తామని ఇచ్చిన మాట ప్రకారం.. వైఎస్సార్ ఆసరా పథకాన్ని ఇప్పటికే రెండు విడతలు అమలు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా మూడో విడత నగదును శనివారం మహిళా సంఘాల సభ్యుల ఖాతాలకు జమ చేయనున్నారు. ఇప్పటికే గ్రూపుల వారీగా జాబితాలను సిద్ధం చేసి లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. మూడో విడతకు సంబంధించి 30 మండలాలు, నాలుగు పురపాలక సంఘాల పరిధిలో 42,326 సంఘాల్లోని 4,53,708 మంది సభ్యులకు రూ.309.43 కోట్ల ప్రయోజనం చేకూరుతోంది. ఇందులో డీఆర్‌డీఏ ఇందిరా కాంతిపథం నుంచి 38,792 సంఘాల్లోని 418354 మంది సభ్యులకు రూ.281.23 కోట్లు, మెప్మా పరిధిలో 3,534 సంఘాల్లోని 35354 మంది సభ్యులకు రూ. 28.20 కోట్ల లబ్ధి చేకూరనుంది. మొదటి, రెండోసారి ఆసరా పథకంలో తప్పిపోయిన వారిని కూడా ఈసారి చేర్పించి రుణమాఫీ వర్తింపచేసే దిశగా చర్యలు తీసుకున్నారు.

డీఆర్‌డీఏ పరిధిలో

మండలం	సంఘాలు	సభ్యులు	ఆసరా నగదు (రూ. కోట్లలో)
ఆమదాలవలస	934	9354	6.67
బూర్జ	914	9386	5.79
పొందూరు	1319	15121	9.45
సరుబుజ్జిలి	612	6455	4.23
ఎచ్చెర్ల	2024	22437	17.48
జి.సిగడాం	1078	12261	8.92
లావేరు	1623	17553	15.18
రణస్థలం	2040	22122	18.01
ఇచ్ఛాపురం	986	10143	6.46
కంచిలి	1277	14396	9.25
కవిటి	1451	16888	9.41
సోంపేట	1586	17517	11.27
జలుమూరు	1095	11411	7.07
నరసన్నపేట	1572	16941	11.41
పోలాకి	1414	15357	9.73
సారవకోట	1047	10877	6.24
మందస	1577	16638	9.16
పలాస	850	8915	5.85
వజ్రపుకొత్తూరు	1638	18084	12.81
హిరమండలం	790	8369	4.19
కొత్తూరు	1052	10967	5.94
ఎల్ఎన్ పేట	595	6292	4.26
మెళియాపుట్టి	983	10434	5.81
పాతపట్నం	1081	11369	5.19
గార	1876	20309	15.91
శ్రీకాకుళం	1887	20322	15.92
కోటబొమ్మాళి	1393	14732	8.43
నందిగాం	1262	13372	10.72
సంతబొమ్మాళి	1522	16640	10.59
టెక్కలి	1317	13692	9.72
మొత్తం	38,792	418354	281.23

మెప్మా పరిధిలో

పురపాలక సంఘాలు	ఎస్‌హెచ్‌జీలు	సభ్యులు	ఆసరా నగదు (రూ.కోట్లలో)
ఆమదాలవలస	616	6295	4.48
ఇచ్ఛాపురం	557	5361	4.40
పలాస	826	8301	7.31
శ్రీకాకుళం	1535	15397	12.01
మొత్తం	3,534	35354	28.20



అర్హులందరికీ రుణమాఫీ

2019 ఎన్నికల నాటికి బ్యాంకు రుణం ఉన్న అన్ని గ్రూపులకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మూడో విడత రుణమాఫీ వర్తిస్తుంది. ఇటీవలే దీనికి సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేశారు. ఇప్పటికే ఆన్‌లైన్ ప్రక్రియ, సభ్యుల అథంటికేషన్లు పూర్తి చేశాం. జాబితాలు సచివాలయాల్లో అందుబాటులో ఉంచాం. అభ్యంతరాలు పరిష్కరించాం. ఈ నెల 25న సభ్యుల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

– డాక్టర్ విద్యాసాగర్, పీడీ, డీఆర్‌డీఏ, శ్రీకాకుళం

స్వాతిసోమనాథ్‌కు ఉగాది పురస్కారం



పురస్కారం అందుకుంటున్న స్వాతి సోమనాథ్

శ్రీకాకుళం కల్చరల్: ప్రముఖ నృత్య దర్శకురాలు, సంప్రదాయం కళా గురుకులం డైరెక్టర్ స్వాతి సోమనాథ్‌ను గురువారం ఉగాది పురస్కారంతో సత్కరించారు. గుంటూరులోని కళా దర్బార్ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా అన్నమయ్య కళావేదికపై నృత్య విభాగంలో ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు పాత్తూరి రంగారావు, పాతూరి నాగభూషణం, డాక్టర్ కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే దోచేశారు

- పది తులాల బంగారం, అరకేజీ వెండి, రూ.20 వేల నగదు చోరీ
- బావరాజుపాలెంలో ఘటన



దొంగతనం జరిగిన ఇంటి వద్ద క్లూస్ టీం సిబ్బంది, స్థానికులు

రణస్థలం: పట్టపగలే ఓ ఇంట్లో దొంగలుపడ్డారు. బంగారు వెండి ఆభరణాలు, నగదుతో ఉడాయించారు. రణస్థలంలోని జె.ఆర్.పురం సమీపంలో బావరాజుపాలెంలో శుక్రవారం జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచలనం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సుగ్గు గోవింద అనే వ్యాపారి జె.ఆర్.పురంలో బ్యాంగిల్ షాపు నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం 9 గంటలకు షాపు తెరిచేందుకు వెళ్లిపోయారు. ఇంటి పనులన్నీ పూర్తయ్యాక అతని భార్య శ్యామల కూడా 11 గంటల సమయంలో షాపు వద్ద వెళ్లారు. అప్పటికే ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఇంటికి సమీపంలోని కొబ్బరి తోటలో మాటువేశారు. ఇంట్లో ఎవరూ లేరని నిర్ధారించుకున్నాక వారిలో ఇద్దరు ఇంటి గడియను కటర్‌తో పగలుకొట్టి లోపలికి ప్రవేశించారు. ఓ వ్యక్తి బయటే బైక్‌తో సిద్ధంగా ఉన్నాడు. ఆ సమయంలో పొరుగింటి మహిళ కామన్‌గా ఉన్న తాగునీటి బోరు మోటార్ వేసేందుకు గోవింద ఇంటికి వచ్చింది. ఈ అలజడితో ఇంటి నుంచి ఇద్దరు వ్యక్తులు నిదానంగా బయటకు నడుచుకుని వచ్చి బైక్‌పై సిద్ధంగా ఉన్న వ్యక్తితో కలిసి క్షణాల్లో పరారయ్యారు. ఇంటి తలుపు గడియలు విరిగి ఉండటాన్ని గమనించిన మహిళ వెంటనే గోవిందకు సమాచారం అందించింది. వారు వచ్చి చూసేసరికి బీరువాలో 10 తులాల బంగారం, అర కేజీ వెండి, రూ.20 వేలు నగదు కనిపించలేదు. వెంటనే జె.ఆర్.పురం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో డీఎస్పీ మత్తే మహేంద్ర, సీఐ ఎస్.ఆదాం, క్లూస్ టీం సిబ్బంది పరిశీలించి వివరాలు సేకరించారు. ఎస్సై జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బీరువా వద్ద వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి



సమీక్ష నిర్వహిస్తున్న చాన్సలర్ ప్రొఫెసర్ కె.సి.రెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎంపురం క్యాంపస్‌లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు రాష్ట్ర ఆర్‌జీయూకేటీ చాన్సలర్ ప్రొఫెసర్ కె.సి.రెడ్డి అన్నారు. శ్రీకాకుళం క్యాంపస్‌ను శుక్రవారం పరిశీలించిన ఆయన అకడమిక్, పరిపాలన అంశాలపై అధికారులతో సమీక్షించారు. న్యూ అకడమిక్ బ్లాక్, వసతి గృహం బ్లాక్, ల్యాబ్‌ల నిర్మాణాలు సకాలంలో పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం నాలుగు వేల మంది విద్యార్థులతో నిర్వహిస్తున్న క్యాంపస్, ఆరు వేల మంది విద్యార్థులతో నిర్వహించేలా మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో నాలుగు క్యాంపస్‌లకు కలిపి అకడమిక్ క్యాలెండర్ మేరకు క్లాస్‌వర్కు, సెమిస్టర్ పరీక్షలు పక్కాగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్య అందిస్తున్నామన్నారు. రిలీవ్ అయ్యే విద్యార్థులు మంచి ప్యాకేజీలతో ఉద్యోగాలు సాధిస్తున్నారని చెప్పారు. జాతీయ సంస్థల్లో పీజీ చదివేందుకు నిర్వహించే గేట్ ప్రవేశ పరీక్షలో సైతం విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు, డీన్ ఆఫ్ అకడమిక్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, పరిపాలనాధికారి ముని రామకృష్ణ, ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు, వైద్యాధికారి డాక్టర్ మొదలవలస భవానీ, ఫైనాన్స్ అధికారి డాక్టర్ అసిరినాయుడు, పీఆర్‌ఓ మామిడి షణ్ముఖ పాల్గొన్నారు.

సార్వత్రిక పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

- పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేదు
- జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి వెల్లడి



మాట్లాడుతున్న డీఆర్వో రాజేశ్వరి

శ్రీకాకుళం పాతబస్టాండ్ : జిల్లాలో వచ్చే నెల 3 నుంచి 17 వరకు జరగనున్న సార్వత్రిక పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక పరీక్షల నిర్వహణపై సమన్వయ కమిటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 1023 మంది విద్యార్థులు ఓపెన్ టెన్త్ పరీక్షలకు హాజరుకానున్నారని, వీరి కోసం ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఇంటర్ పరీక్షలకు 1727 మంది హాజరు కానుండగా, వీరి కోసం ఏడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇంటర్ ప్రాక్టికల్స్‌కు ఐదు కేంద్రాలు సిద్ధం చేశామన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. అన్ని కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. ఉప తహశీల్దారు స్థాయి అధికారులతో కూడిన ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. సిబ్బంది, విద్యార్థులు పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకురావడానికి వీలు లేదన్నారు. సమావేశంలో అదనపు పోలీసు సూపరింటెండెంట్ పి.విఠల్‌రావు, జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ, విద్యాశాఖ సహాయ కమిషనర్ ఆలీఖాన్, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జంపు కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ రోగుల సంక్షేమమే ధ్యేయం



ఇంజక్షన్ల బాక్సు అందిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

కాశీబుగ్గ: ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ రోగులకు నాగార్జున ఫెర్టిలైజర్ కోరమాండల్ సంస్థ వితరణ చేసిన ఖరీదైన ఎరిత్రోపాయిటిన్ ఇంజక్షన్లు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ కోరారు. శుక్రవారం పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో డయాలసిస్ రోగులకు 1300 ఎరిత్రోపాయిటిన్ ఇంజక్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేల రూపాయలు ఖరీదైన ఇంజక్షన్లు ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ చిన్నంనాయుడు, డాక్టర్ రఘురాం, డాక్టర మేఘన, డాక్టర్ మౌనిక, డాక్టర్ అశ్విని, గీతారాణి, జోనల్ హెచ్ఆర్ వెన్నెల, అంకిత, ఫెర్టిలైజర్ హెడ్ జయకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం చేసే ఎస్సీ రైతులకు ఆర్థిక సాయం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ప్రకృతి వ్యవసాయ విధానంలో (రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా) పంటలు, కాయకూరలు పండించే షెడ్యూల్డ్ కులాల రైతులకు ఆర్థిక సాయం అందించనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. రూ.10 వేలు విలువైన విత్తనాలు, వ్యవసాయానికి అవసరమైన పనిముట్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, ఈ నెల 27లోగా జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఆశీల వసూలుకు వేలం ఖరారు



వేలం నిర్వహిస్తున్న అధికారులు

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణ మార్కెట్‌లో రోజువారీ ఆశీలు వసూలు చేసేందుకు వేలం పాట ఖరారైంది. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కె.అప్పలనాయుడు ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. మార్కెట్‌లో ఆశీల వసూలును శరత్‌చంద్ర రూ.24 లక్షలకు దక్కించుకున్నారు. గత ఏడాది కంటే రూ.9 లక్షల 16 వేలు అధికంగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. కమేలా నిర్వహణ ఆశీలు కూడా శరత్‌చంద్ర దక్కించుకున్నారు. చింతాడ సంతలో ఆశీల వసూలుకు వేలం నిర్వహించగా ఎవరూ హాజరు కాకపోవడంతో వాయిదా వేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ లక్ష్మినారాయణ, ఆర్ఐ రామారావు తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ ఇంటి పన్నుల స్వీకరణ

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఇంటిపన్ను, ప్రభుత్వ ఆస్తి పన్ను, బకాయిలపై వడ్డీమాఫీలను ఈ నెల 26న(ఆదివారం) చెల్లించుకునేందుకు వెసులుబాటు కల్పించినట్లు శ్రీకాకుళం నగర కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేషు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామనవమి(30న) కూడా పన్నులు స్వీకరిస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఇంటర్ పరీక్షలకు 767 మంది గైర్హాజరు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి. 8వ రోజు శుక్రవారం మాథ్స్–2(బి), జువాలజీ పేపర్–2, హిస్టరీ పేపర్–2 పరీక్షలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 109 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షల్లో మొత్తం 25452 మంది విద్యార్థులకు గాను 24685 మంది పరీక్ష రాశారు. వివిధ కారణాలతో 767 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియెట్ విద్య జిల్లా అధికారి కె.ప్రకాశరావు, ఆర్ఐఓ ఎస్.తవిటినాయుడు, డీఈసీ సభ్యులు ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. ఇప్పటి వరకు ఎలాంటి మాల్‌ప్రాక్టీసులు నమోదుకాలేదని ఆర్ఐఓ తవిటినాయుడు తెలిపారు.

యూత్ రెడ్‌క్రాస్ సభ్యులకు అభినందనలు



బహుమతులు అందుకుంటున్న జిల్లా విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: హర్యానా రాష్ట్రం కురుక్షేత్రలో నిర్వహించిన ఇంటర్ స్టేట్ యూత్ రెడ్‌క్రాస్ కార్యక్రమంలో పాల్గొని జిల్లాకు తిరిగి వచ్చిన యూత్ రెడ్‌క్రాస్ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు శుక్రవారం అభినందించారు. మార్చి 16 నుంచి 21 వరకు జరిగిన కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులతో కలిసి విపత్తుల నిర్వహణ, సాఫ్ట్‌స్కిల్స్‌లో మెలకువలపై శిక్షణ పొందారు. వ్యాసరచన, డ్రామా పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందారు.

26న సిక్కోలులో డాగ్ ఫెస్ట్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలో ఈ నెల 26న సిక్కోలు డాగ్ ఫెస్ట్ నిర్వహించనున్నామని వెంకీ పెట్ నిర్వాహకుడు మలిపెద్ది వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలో మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రదర్శన ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జిల్లాలో తొలిసారిగా డాగ్ ఫ్యాషన్ షో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. డాక్టర్ డాగ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శునకాలకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తామని తెలిపారు.

మండుటెండలో మిర్చి!



వారంరోజులుగా అడపాదడపా కురిసిన వర్షాలకు ఎండుమిర్చి రైతులు ఇబ్బందులుపడ్డారు. ఇప్పటికే సిద్ధంగా ఉన్న ఎండుమిరపకాయలను ఎండబెట్టేందుకు అవస్థలుపడ్డారు. శుక్రవారం కాస్త ఎండ కాయడంతో పోలాకి–పల్లిపేట రోడ్డులో పంటను ఎండబెట్టారు. పోలాకి, వెదుళ్లవలస, డోల, పల్లిపేట, గోవిందపురం, జొన్నాం, అంపలాం, గంటపేట, సంతలక్ష్మిపురం, మోగివిల్లిపేట తదితర గ్రామాల్లో సుమారు 500 ఎకరాల్లో మిర్చి సాగుచేస్తున్నట్లు వ్యవసాయ అధికారి పి.చిరంజీవి తెలిపారు. –పోలాకి

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150–00
బంగారం(22సి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215